# మధ్యప్రదేశ్ రైతాంగంపై ఆ రాష్ట్ర బిజెపి ప్రభుత్వం కాల్పులు జరిపి ఆరుగురు రైతులను బలిగొనడాన్ని ఖండించండి

## తమ న్యాయమైన డిమాండ్లపై పోరాడుతున్న వివిధ రాష్ట్రాల రైతాంగానికి సంఘీభావంగా నిలుద్దాం

**మధ్యప్రదేశ్** రాష్ట్రం- మాంద్‌సౌర్‌జిల్లా కేంద్రంలో రైతుల ఆందోళనపై 6-6-17న బిజెపి ఆధ్వర్యంలోని శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రభుత్వ పోలీసులు కాల్పులు జరిపి మొత్తంగా ఆరుగురు రైతులను బలిగొన్నారు; మరి అనేకమందిని తీవ్రంగా గాయపరిచారు. మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఈ హత్యాకాండను రైతుకూలీసంఘం (ఆం.ప్ర) తీవ్రంగా ఖండిస్తోంది. పోలీసు కాల్పులలో మృతిచెందినవారికి జోహార్లర్పిస్తోంది. ఈ పాశవిక మారణకాండకు బాధ్యులైన పోలీసు ఉన్నతాధికారులతో సహా రాష్ట్ర ప్రభుత్వ నేతలపై హత్యానేరం మోపి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తోంది.

దేశంలో ఏ రాష్ట్రమైనా రైతుల వెతలన్నీ ఒక్కటే. కేంద్రంలో రాష్ట్రాలలో ఏ పార్టీలు అధికారంలో వున్నా రైతాంగ వ్యతిరేక విధానాల అమలుతీరు ఒక్కటే. బిజెపి పాలిత మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇందులో భాగమే. వరుస కరువుల నెదుర్కొంటున్న రాష్ట్రరైతాంగం దిగుబడులురాక గత సం॥వరకు తీవ్రంగా నష్టపోయి అప్పుల ఊబిలో కూరుకుపోయారు. గత సంవత్సరమే వాతావరణం అనుకూలించి పంటల దిగుబడి బాగా వున్నా, మార్కెట్లో కనీస ధరలేక నిస్పృహతో క్రుంగిపోయారు. మధ్యప్రదేశ్ రాష్ట్రవ్యాపితంగా గత నాలుగు నెలల కాలంలో 2300 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారంటే వారి పరిస్థితి ఎంత దయనీయంగా వుందో, పాలకులెంతటి దుర్మార్గంగా వున్నారో అర్థమౌతుంది. అధికంగా పండిన ఉల్లిధర కిలో రూ.8 నుండి కిలో ఒక్క రూపాయికి పడిపోవడం దీనికొక ఉదాహరణ మాత్రమే.

ఈ పరిస్థితి వారిలో మరోవైపున ఆగ్రహావేశాలను రగిలించింది. తాము పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, వ్యవసాయ రుణాలను మాఫీ చేయాలని, వ్యవసాయ విద్యుత్తు బిల్లులను రద్దుచేయాలని, వృద్ధులైన వ్యవసాయకూలీలకు, రైతులకు పెన్షను సౌకర్యం కల్పించాలని డిమాండ్‌చేస్తూ రైతాంగం ఆందోళనకు పూనుకున్నారు. ప్రదర్శనలు, ధర్నాలు, రాస్తారోకోలు చేసి అధికారులకు మెమోరాండాలు సమర్పించినా ప్రభుత్వంలో చలనం లేదు. రాష్ట్రవ్యాపితంగా వివిధ రైతు సంఘాల ఐక్యకార్యాచరణ ఆధ్వర్యంలో జూన్ ఒకటవ తేదీనుండి 10వ తేదీవరకు వివిధ దశల ఆందోళనా కార్యక్రమాలను, సమ్మెను ప్రకటించారు. బిజెపి తన ఎన్నికల ప్రణాళికలో రైతుల సంక్షేమంకోసం ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని డిమాండ్‌చేస్తూ రైతులు రోడ్లపైకొచ్చారు.

పొరుగునున్న మహారాష్ట్ర రైతాంగం కూడా ఇవే డిమాండ్లపై ఆందోళనతో ముందుకొచ్చారు. మహారాష్ట్రలో ఈ సీజన్‌లో కందిపంట బాగా పండినా క్వింటా ధర రు.12వేల నుండి రు.3 వేలకు పడిపోవటంతో వారి కడుపు రగిలిపోయింది. జూన్ ఒకటి నుండి వివిధ రూపాల్లో నిరసనాందోళనలు చేపట్టారు. పట్టణాలకు, నగరాలకు-పాలు, కూరగాయల రవాణా బంద్‌చేసి వాటిని రోడ్లపై పారబోసి నిరసన తెలిపారు. జూన్ 5వ తేదీన రాష్ట్రబంద్ నిర్వహించి తమ సంఘటిత చైతన్యాన్ని ప్రదర్శించారు. రైతుల రుణమాఫీ చేస్తానని మహారాష్ట్ర బిజెపి ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌కు ప్రకటించక తప్పలేదు.

ఇదే తరహాలో పంజాబ్, హర్యానా, రాజస్థాన్ రైతులు ఉద్యమబాటలో సాగుతున్నారు. పంజాబ్ ముఖ్యమంత్రి అమరీందర్‌సింగ్ రైతాంగ రుణమాఫీకి సానుకూలంగా హామీ ఇవ్వాల్సివచ్చింది.

ఈ విధంగా వివిధ ఉత్తరాది రాష్ట్రాలలో రైతాంగ ఆందోళనలు రగులుకుంటుండగా, దీనిని మరింతగా విస్తరించనీయకుండా అణచివేయటానికి కేంద్ర, రాష్ట్రాల పాలకులు పూనుకున్నారు.

6-6-17న మధ్యప్రదేశ్ రాష్ట్రం మాందసౌర్ జిల్లా కేంద్రంలో ఆందోళన సాగిస్తున్న రైతులపై పోలీసులు మూకుమ్మడిగా కాల్పులు జరిపి-మొత్తంగా ఆరుగురిని బలిగొన్నారు. మరి అనేకమంది ఈ సందర్భంగా గాయపడ్డా రైతులు బెదిరిపోలేదు. మరింతగా ఆగ్రహించిన రైతాంగం పోలీసు వాహనాలకు నిప్పుపెట్టారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారటంతో ప్రభుత్వం వివిధ ప్రాంతాల్లో కర్ఫ్యూ విధించాల్సి వచ్చింది. రైతాంగ ఆందోళన కొనసాగుతోంది.

తొలుత రైతాంగ వత్తిడితో ఈ ఆందోళనల్లో కలిసివచ్చిన బిజెపి అనుబంధ భారతీయ కిసాన్ సంఘ్, చర్చలలో ప్రభుత్వమిచ్చిన హామీలతో సంతృప్తిచెందినట్లు ప్రకటించి, ఉద్యమం నుండి విరమించుకొన్నప్పటికీ, రైతాంగం ఆందోళనను కొనసాగించటం అభినందనీయం.

తమ వ్యవసాయ రుణమాఫీకోసం, గిట్టుబాటు ధరల డిమాండ్లపై ఇటీవలి కాలంలో తమిళనాడు రైంతాంగం వందలాదిమంది ఢిల్లీ నడిరోడ్లపై మండుటెండల్లో వినూత్న పద్ధతుల్లో 40 రోజులపైగా నిరసనాందోళనలు నిర్వహించారు. తమిళనాడు రాష్ట్రవ్యాపితంగా రైతాంగం ఈ డిమాండ్లపై ఉద్యమించారు.

ఇరు తెలుగు రాష్ట్రాలలోనూ రైతాంగం పండించిన పంటలకు న్యాయమైన ధరలు లేక ముఖ్యంగా మిర్చి, పసుపు రైతాంగం - ప్రభుత్వాల 'చేయూత', 'సహకార' పథకాల మోసకారితనంతో మరింతగా నష్టపోతున్నారు. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారంకోసం ఉల్లి, కూరగాయలను రోడ్లపై పారబోసి, మిర్చిని రోడ్లపై తగులబెట్టి రాస్తారోకో, ధర్నాలు మొదలైన వివిధ రూపాల్లో నిరసనాందోళనలు నిర్వహిస్తున్నారు.

దేశవ్యాపితంగా వివిధ రాష్ట్రాలలో రైతాంగంలో పెల్లుబుకుతున్న ఈ అసంతృప్తి, ఆగ్రహాలు నిరసనాందోళనలు, ఉద్యమాల రూపం తీసుకోవటం హర్షణీయం. రానున్న 5 ఏళ్ళలో రైతాంగ ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని ప్రధాని మోదీ, రాష్ట్రాలలో ముఖ్యమంత్రులు ఒకవైపు ప్రకటనలు చేస్తూనే మరోవైపు వేలాదిమంది రైతులు ప్రాణాలు తీసుకుంటున్నా పట్టనట్లు నటిస్తున్నారు.

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని బహుళజాతి కంపెనీల దోపిడీకి బార్లా తెరిచి వుంచింది. కార్పొరేట్, కంపెనీ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోంది. వ్యవసాయ ఉత్పత్తులకు దేశమంతా ఒకే మార్కెట్టును రూపొందిస్తే రైతాంగానికి గిట్టుబాటు ధర వస్తుందంటూ ప్రకటనలు గుప్పించి, ఈ రొదలో వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్టు యార్డులన్నింటినీ ప్రైవేటీకరించడానికి పూనుకుంది. ఆ విధంగా రైతాంగాన్ని విదేశీ బహుళజాతి కంపెనీల ముందు నిస్సహాయులుగా నిలబెట్టేందుకు చర్యలు తీసుకుంది. ప్రభుత్వ ఆధ్వర్యంలోని వ్యవసాయ మార్కెట్టు యార్డులలోనే నిబంధనలను అతిక్రమించి గుత్త వ్యాపారులు దోపిడీ సాగిస్తుంటే, ఇక ఒక గుత్త కంపెనీ నడిపే యార్డులో దోపిడీ ఎంత తీవ్రంగా ఉంటుందో వూహించవచ్చు.

ఇటువంటి నేపథ్యంలో రైతాంగ సమస్యల పరిష్కారానికి 'ఆత్మహత్యలు కాదు – పోరాటమే పరిష్కార మార్గ'మనే నినాదాన్ని మధ్యప్రదేశ్ రైతాంగ అమరుల స్ఫూర్తిగా బలంగా యావత్తు గ్రామీణ ప్రజానీకం మధ్యకు మరోసారి తీసుకువెళ్ళాలి. లక్షలాదిమంది రైతులు బలవన్మరణాలకు పాల్పడుతున్నా చీమ కుట్టినట్లైనా లేని పాలకులకు, 'పోరాటంలో ప్రాణాలర్పిద్దాం' అంటూ ముందుకు సాగితే వెన్నులో వణుకుపుడుతుందని ఆచరణలో మరోసారి స్పష్టమవుతోంది.

రైతాంగ, వ్యవసాయ సంక్షోభం చుట్టుముట్టిన ఈ సమయంలో సంఘటిత ఉద్యమాలకు సమాయత్తం కావాలని, పోరాడుతున్న వివిధ రాష్ట్రాల రైతాంగానికి సంఘీభావం ప్రకటించాలని రైతుకూలీసంఘం(ఆం.ప్ర) విజ్ఞప్తి చేస్తోంది.

**రైతుకూలీసంఘం(ఆంధ్రప్రదేశ్)**
**7-6-2017**

oooooo